క్లుప్తంగా

ప్రారంభానికి సిద్ధం



కొత్తగా నిర్మించిన మున్సిపల్ కార్యాలయ భవనం

కొడంగల్: పట్టణంలో నిర్మించిన మున్సిపల్ కార్యాలయ నూతన భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. సుమారు రూ.7కోట్ల వ్యయంతో నిర్మించారు. చైర్మన్ కోసం, కమిషనర్ కోసం చాంబర్లు, సమావేశ మందిరం, మున్సిపల్ సిబ్బంది కోసం గదులను ఆధునిక సౌకర్యాలతో నిర్మాణం చేపట్టారు. మున్సిపల్ కార్యాలయానికి వివిధ పనుల మీద వచ్చే ప్రజల సౌకర్యార్థం కూర్చోడానికి గదులు కూడా నిర్మించారు. త్వరలో ఈ భవనాన్ని ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి

పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య



మాట్లాడుతున్న మొగులయ్య

కుల్కచర్ల: రైతాంగ అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ డైరెక్టర్, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి పేర్కొన్నారు. శనివారం కుల్కచర్ల మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..వ్యవసాయరంగంలో చిన్నతరహా, మధ్యతరహా రైతుల ఉన్నతికి పీఎంధన్ ధని క్రిషి యోజన పథకాన్ని తీసుకొచ్చారన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడి వచ్చే వ్యవసాయ పద్ధతులను అవలంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కొండయ్య, నాయకులు జోగు వెంకటయ్య, గోపాల్, రవీందర్, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వెళ్లాలంటే రాళ్ల బాటే!

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు



చదును చేయని రాళ్ల కుప్ప

కొడంగల్: పట్టణంలోని కేంద్ర ప్రాథమిక పాఠశాలకు వెళ్లాలంటే గగనంగా మారింది. పాఠశాలకు వెళ్లే దారిలో రాళ్లు, మొరం గుట్టగా పోసి మరమ్మతులు చేపట్టలేదు. ఇటీవల వర్షం కురవడం వల్ల బురద ఏర్పడింది. దీంతో విషయం గ్రహించిన ఉపాధ్యాయులు రోడ్డు విస్తరణ అధికారులకు మట్టి పోయించి చదును చేయాలని కోరారు. మట్టి కుప్పలను పోయించిన అధికారులు చదును చేయించకుండానే అలాగే వదిలేశారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలకు ఆ దారి గుండా వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

కొడంగల్ రూరల్: పట్టణశివారులోని సిద్ధనొంపు పడమటి ఆంజనేయస్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, చందన లేపనం, విశేష అలంకరణ వంటి పూజలు నిర్వహించారు. అనంతరం 107వ శనివారం పురస్కరించుకొని సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ధూపం, దీపం, నైవేద్యం సమర్పిస్తూ మంగళ హారతులు ఇచ్చారు.

ప్రారంభమైన తిరుమల నాథస్వామి ఉత్సవాలు

పూడూరు: మండల పరిధిలోని పెద్ద ఉమ్మెంతాల్ గ్రామంలో తిరుమల నాథ స్వామి ఉత్సవాలు శనివారం ప్రారంభించారు. ఆదివారం ఉదయం సామూహిక గీతాయజ్ఞం, తెల్లవారు జామున స్వామివారి రథోత్సవం, సోమవారం పూల వసంతోత్సవం, 14న స్వామివారి ఏకాంతసేవ, మానస పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ పీఠాధిపతి వెంకటదాసు పేర్కొన్నారు.

ఎగ్ బిర్యానీ ఎత్తేశారు!

- అంగన్ వాడిల్లో ఒక్కరోజుకే పరిమితం
- ఆదేశాలు వస్తే అమలు చేస్తాం
- ఐసీడీఎస్ అధికారులు



దౌల్తాబాద్: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో అంగన్‌వాడీల పాత్ర కీలకంగా మారింది. ఆయా కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం సంస్కరణలతో పాటు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోంది. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి పెట్టింది. దీనికోసం ప్రభుత్వం ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందజేస్తుంది. ఈ క్రమంలోనే జూన్ 11న ఎగ్ బిర్యానీ కార్యక్రమాన్ని ఆర్భాటంగా ప్రారంభించింది. «అమ్మమాట..అంగన్‌వాడీ బాట»లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎగ్ బిర్యానీ తయారు చేశారు. ఈ కేంద్రాలకు వచ్చిన అధికారులు బాలింతలు, చిన్నారులు గర్భిణులకు అందజేశారు. అంగన్‌వాడీల్లో ఉండే బియ్యం ఆహార పదార్థాలతో రుచికరంగా వారంలో రెండు సార్లు పెట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు అంగన్‌వాడీ టీచర్లు కూడా ఉత్సాహం చూపించారు. కానీ నిధులు మంజూరు చేయకపోవడంతో ఎగ్ బిర్యానీకి మంగళం పాడారు.

అమలుకు నోచుకోలేదు

మండలంలో 66 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో గర్భిణులు 293, బాలింతలు 259, చిన్నారులు 2,623 మంది ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు, 3–6 ఏళ్లలోపు పిల్లలకు నిత్యం ఒక గుడ్డు, 6నెలల నుంచి 3 ఏళ్లలోపు పిల్లలకు నెలకు 16 గుడ్లు ఇస్తారు. అయితే వారు మరింత బలవర్ధకంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎగ్‌బిర్యానీ పథకాన్ని తీసుకొచ్చింది. కానీ నేటికి బిర్యానీ పథకం అమలుకు నోచుకోవడంలేదు. ప్రారంభం రోజు ఎంతో ఉత్సాహంగా భోజనం చేశారు. అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు మంజూరు కాకపోవడంతో సొంత ఖర్చులతో బిర్యానీ తయారు చేయడం భారంగా భావించినా టీచర్లు ఈ పథకాన్ని పక్కన పెట్టారు. ప్రభుత్వ ఆలోచన బాగానే ఉన్నా ప్రకటనలకే పరిమితం అయ్యిందని పలువురు విమర్శిస్తున్నారు.

> **మెనూలో లేదు..**
>
> అంగన్‌వాడీలో ఎగ్‌బిర్యానీ తయారుచేయాలని ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. దీంతో మెనూలో కూడా చేర్చలేదు. అక్కడక్కడ సెంటర్లలో టీచర్లు ఏదో ఒక రోజు చిన్నారులకు సొంతంగా వండిపెడుతున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే మెనూలో ఉంచి వడ్డిస్తాము.
>
> – మంజుల, సూపర్‌వైజర్, ఐసీడీఎస్, దౌల్తాబాద్

నమ్మించి మోసం చేసిన ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్య ముదిరాజ్

కుల్కచర్ల: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను నమ్మించి మోసం చేసిందని బీజేపీ కుల్కచర్ల మండల అధ్యక్షుడు జి.వెంకటయ్య ముదిరాజ్, జిల్లా కార్యవర్గసభ్యుడు గాదె మైపాల్ పేర్కొన్నారు. శనివారం కుల్కచర్ల మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని, ఎన్నికలకు వెళ్లడం, కోర్టు స్టే ఇవ్వడం వంటివి డ్రామ చేసినట్లుగా తెలుస్తోందని విమర్శించారు. బీసీలకు రాజ్యాధికారం ఇచ్చే ఉద్దేశం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని మండిపడ్డారు. జీవో9ను శాస్త్రీయంగా అమలుచేసి ఉంటే హైకోర్టు జీవోపై స్టే ఇచ్చే ఆస్కారం ఉండేదికాదని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీలు ఏకమై బుద్ధిచెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రలింగం, మల్లేశ్, శ్రీశైలం, పోమాల నరేశ్, రాజు, మహేశ్, వెంకటేశ్, వెంకట్రాములు, చెన్నయ్య, చంద్రమౌళి, నరేశ్, శివ, సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యపై దృష్టి అవసరం

ఎంఈఓ మల్లయ్య



శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో ఎంఈఓ మల్లయ్య

మొయినాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతికతను పెంచి విద్యార్థుల్లో జ్ఞానాన్ని పెంపొందించాలని ఎంఈఓ మల్లయ్య సూచించారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు డిజిటల్ లెర్నింగ్, కోడింగ్, పైథాన్ ప్రోగ్రామింగ్, థోనీ ప్రోగ్రామింగ్‌పై మూడురోజుల పాటు జరిగిన శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మారుతున్న టెక్నాలజీపై ఉపాధ్యాయులు అవగాహన పెంచుకొని వాటిని విద్యార్థులకు నేర్పించాలని సూచించారు. బహుళ ప్రయోజనాలతో కూడిన డిజిటల్ పాఠాలు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్యం పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్, డీఆర్పీ సిద్ధం శ్రీనివాస్, రిసోర్స్ పర్సన్లు బాలమణి, అంజిలప్ప, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీపరీక్షల్లో పాల్గొనాలి



మాట్లాడుతున్న ఎంఈఓ మనోహర్

ఎంఈఓ మనోహర్

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని ఎంఈఓ మనోహర్ అన్నారు. శనివారం పట్టణంలోని నారాయణ పాఠశాలలో మహబూబ్‌నగర్ జోనల్‌స్థాయి మాస్టర్ ఓరేటర్ కాంటెస్ట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు షాద్‌నగర్, వనపర్తి విద్యార్థుల మధ్య హోరాహోరిగా సాగింది. ఈ కార్యక్రమానికి ఎంఈఓ హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యనభ్యసించాలన్నారు. ఇలాంటి పోటీపరీక్షలు విద్యార్థుల అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయన్నారు. పోటీ పరీక్షలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ జీఎం గోపాల్‌రెడ్డి, డీజీఎం వెంకట్‌రెడ్డి, జ్యూరీ సభ్యులు శ్రీకాంత్, మచ్చేందర్, స్వాతి, గౌతమి, ఆర్జీ అనిల్‌కుమార్, హెచ్‌ఆర్ సతీశ్, కో–ఆర్డినేటర్ నితిన్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మాధవి, ఏఓ శ్రీధర్, అకాడమిక్ డీన్ అనురాధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవాదృక్పథాన్ని అలవర్చుకోవాలి



ప్రిన్సిపాల్, అధ్యాపకులతో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాంలో పాల్గొన్న విద్యార్థినులు

ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాపోలె

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు సేవాదృక్పథాన్ని అలవర్చుకొని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాపోలె అన్నారు. పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అఫ్రోజాహన్ ఆధ్వర్యంలో శనివారం మండల పరిధిలోని కమ్మదనంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శీతకాల శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీతాపోలె హాజరై కార్యక్రమాన్ని ప్రాంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి విద్యతో పాటు సామాజిక సేవపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. సమాజంలో బాలికలు, మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టేందుకు అందరూ ముందుకు రావాలని కోరారు. బాల్య వివాహాలతో భవిష్యత్ నాశనం కావడంతో పాటు ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. విద్యార్థినులు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగి స్థిరపడిన తర్వాతే వివాహం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యురాలు అరుణ అంజయ్యగౌడ్, మాజీ ఉపసర్పంచ్ అమర్నాథ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జగదీశ్వర్, అధ్యాపకులు కళాజ్యోతి, పరమేశ్వరి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు నిరాశ

కొడంగల్: సీఎం రేవంత్‌రెడ్డిని కలవడానికి శనివారం ఉదయం హైదరాబాద్ వెళ్లిన పలువురు ఉపాధ్యాయులకు నిరాశ ఎదురైంది. మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ గ్రామ శివారులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల, ఎరన్‌పల్లి గ్రామ శివారులో నిర్మిస్తున్న మెడికల్ కళాశాలను కొడంగల్ నుంచి లగచర్లకు తరలిస్తున్నారనే విషయంపై సీఎంకు వినతి పత్రం ఇవ్వడానికి వెళ్లారు. అక్కడ వారికి అనుమతి లభించక పోవడంతో తిరిగి కొడంగల్‌కు వచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు మంజూరు చేసిన మెడికల్ కళాశాల, ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలను కొడంగల్‌లోనే కొనసాగించాలని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి సరైన నిర్ణయం తీసుకోవాలని ఉపాధ్యాయులు భావిస్తున్నారు.

మొబైల్ ఫోన్లను పోగొట్టుకోవద్దు

- సీఐ వెంకట్
- వారాంతపు సంతల్లో జాగ్రత్త

మోమిన్‌పేట: మోమిన్‌పేట, మర్పల్లి, నవాబ్‌పేట మండలాల్లో నిర్వహిస్తున్న వారాంతపు సంతల్లో మొబైల్ ఫోన్లను పోగొట్టుకోకుండా జాగ్రత్తగా చూసుకోవాలని సీఐ వెంకట్ సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ వారాంతపు సంతల్లో కూరగాయలు, ఇతర సరుకులు కొనుగోలుచేసే సమయంలో ఎమార్చి ఫోన్లను దొంగిలిస్తున్నారన్నారు. కొట్టేసిన ఫోన్‌లో ఓటీపీ, పిన్ నంబర్లను మార్చి ఫోన్ పే, గూగుల్ పే తదితర యూపీఐల నుంచి డబ్బులను కాజేస్తున్నారని ఆయన తెలిపారు. ఇప్పటికే ప్రతీ వారాంతపు సంతలో సివిల్ డ్రస్సులో పోలీసుల పహారా ఉంచుతున్నట్లు ఆయన వివరించారు. ఏవరైనా ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. పోగొట్టుకున్న ఫోన్లకు, ఏదైనా సైబర్ నేరం సంభవించిన వెంటనే 1930కి హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని ఆయన పేర్కొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

చేవెళ్ల: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని గొల్లపల్లి మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్ అన్నారు. మండలంలోని గొల్లపల్లి అనుబంధ గ్రామమైన ధర్మసాగర్‌లో హెచ్‌ఎండీఏ నిధులతో చేపడుతున్న సీసీరోడ్డు పనులను స్థానిక ప్రజలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం అవుతున్నాయన్నారు. ప్రభుత్వ సహకారంతో గ్రామాల అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు రాజీరెడ్డి, రాంచంద్రారెడ్డి, విఘ్నేశ్‌గౌడ్, గ్రామ పెద్దలు, నాయకులు, యువకులు ఉన్నారు.

గుంతల రోడ్లకు మరమ్మతులు

మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి



పనులు ప్రారంభిస్తున్న మహేందర్‌రెడ్డి తదితరులు

మోమిన్‌పేట: మోమిన్‌పేట నుంచి శంకర్‌పల్లి వెళ్లే రహదారికి మరమ్మతు పనులు చేపట్టినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని చిలుకవాగు వద్ద రోడ్డు మరమ్మతు పనులను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాలుగా రోడ్డు గుంతలుగా ఉండి, కంకరతేలి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. దీన్ని దృష్టిలోఉంచుకొని శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రత్యేక చొరవ చూపి మరమ్మతు పనులకు నిధులు మంజూరు చేయించారన్నారు. చీమల్‌దరి గ్రామం వరకు పనులు చేపడతామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు మహేందర్, సిరాజొద్దీన్, మహంత్‌స్వామి, ఎజాస్ తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామి వార్షికోత్సవాలు



మల్లికార్జున స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న పూజలో భక్తులు

నేడు నవగ్రహాలు, ధ్వజస్తంభ, వీరభద్రేశ్వర స్వామి విగ్రహాల ప్రతిష్ఠ

దుద్యాల్: హకీంపేట్ గ్రామంలో భక్తి పరవశం నిండుకుంది. గ్రామంలో మల్లికార్జున స్వామి దేవాలయం నిర్మించి ఐదు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం వార్షికోత్సవాన్ని వైభవంగా ప్రారంభించారు. దేవుళ్ల విగ్రహాలు, ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించనున్నారు. అందులో భాగంగానే శుక్రవారం రాత్రి గ్రామంలో ఊరేగింపు చేపట్టారు. శనివారం ఆలయంలో గణపతి గౌరీ పూజ, గోపూజ, అఖండ దీపారాధన, పుణ్యాహవాచనం, యాగశాల ప్రవేశం, రుత్విగ్వరణము, ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన ముఖ్య నాయకుడు గజ్జెల నర్సింహా రెడ్డి కుటుంబ సభ్యులు, గ్రామస్తుల సహకారంతో విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం నవగ్రహాలు, ధ్వజస్తంభం, వీరభద్రేశ్వర స్వామి, రేణుక చార్య మాతల విగ్రహాల ప్రతిష్ఠాపన ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

భవన నిర్మాణానికి భూమిపూజ



బండవెల్కిచర్లలో బీసీ కమ్యూనిటీ భవన నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న నేతలు

కుల్కచర్ల: బీసీల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏఎంసీ చైర్మన్ ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, పాంబండ ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామంలో బీసీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..బీసీల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, నాయకులు అంజిలయ్య, గోవర్దన్ రెడ్డి, బాల్‌రెడ్డి, గోపాల్ నాయక్, జోగు వెంకటయ్య, భరత్‌కుమార్ రెడ్డి, చంద్రయ్య, అంబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగికి విరమణ సహజం

పంచాయతీరాజ్ డీఈఈ గణేశ్, ఎస్‌టీఓ లక్ష్మణ్



పీఆర్ సీనియర్ అసిస్టెంట్ ప్రేమలత దంపతులను సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

చేవెళ్ల: ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ అనేది సహజమేనని పంచాయతీరాజ్ డీఈఈ గణేశ్, చేవెళ్ల ఎస్టీఓ లక్ష్మణ్ అన్నారు. మండల పరిధిలోని ఓఫాంహౌజ్‌లో శనివారం ఇటీవల పదవీ విరమణ పొందిన పీఆర్ డిపార్టుమెంట్ సీనియర్ అసిస్టెంట్ ప్రేమలత పదవీ విరమణ సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమలత స్టీవెన్ దంపతులను ఆయా శాఖల అధికారులు, సిబ్బంది బంధువులు ఘనంగా వీడ్కోలు తెలిపి సన్మానం చేశారు. అందరితో కలిసి మెలసి ఉంటూ అందరినీ ఆప్యాయంగా పలకరించే ప్రేమలత పదవీ విరమణ అనంతరం శేషజీవితం ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఈ ప్రభాకర్, అధికారులు ఆశాజ్యోతి, హనీష, ప్రశాంత్, శ్రీనివాస్, వికారాబాద్ జిల్లా డీపీఆర్‌ఓ ప్రభాకర్, రిటైర్డు డీఈఈ జగన్‌రెడ్డి, నాయకులు పి.ప్రభాకర్, మోకురం నర్సింలు, జేరాజు, బంధువులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

‘పల్స్ పోలియో’ను విజయవంతం చేయండి

శంకర్‌పల్లి: నేటి నుంచి మూడురోజుల పాటు శంకర్‌పల్లిలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు రేవతీరెడ్డి తెలిపారు. పుట్టిన పిల్లల నుంచి 5 ఏళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. పట్టణ పీహెచ్‌సీ పరిధిలో మొత్తం 5,492 మంది పిల్లలు ఉన్నట్లు గుర్తించామని, అందుకుగాను 34 బూత్‌లు ఏర్పాటు చేసినట్లు ఆమె స్పష్టం చేశారు.

వైభవంగా ఆర్‌ఎస్‌ఎస్ పథసంచలన్

పుర వీధుల గుండా స్వయంసేవకుల కవాత్



తాండూరు టౌన్: ఆర్‌ఎస్‌ఎస్ సేవకులపై పూలు చల్లుతున్న హిందూ ఉత్సవ కేంద్ర సమితి సభ్యులు

తాండూరు టౌన్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని తాండూరు శాఖ పట్టణంలో శనివారం పదసంచలన్ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ప్రారంభమైన ఈ కవాత్ అంబేడ్కర్ చౌక్, ఇందిరాచౌక్, శివాజీ చౌక్, భద్రప్ప గుడి, రైల్వే స్టేషన్ గుండా కొనసాగింది. హిందూ ఉత్సవ కేంద్ర సమితి సభ్యులు, హిందూ బంధువులు ర్యాలీ నిర్వహిస్తున్న స్వయం సేవకులపై పూల వర్షం కురిపించారు. భారత్ మాతాకీ జై అనే నినాదాలతో తాండూరు పట్టణం మారుమ్రోగింది.

యాలాల: యాలాల మండల కేంద్రంలో పథ సంచలన నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయం సేవకులు దండ సహిత గణవేష్‌లో చేపట్టిన ర్యాలీ ఆకట్టుకుంది. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పూలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సిద్రాల శ్రీనివాస్, ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.



యాలాల: ర్యాలీ నిర్వహిస్తున్న కార్యకర్తలు



తాండూరు టౌన్‌లో..